క్లుప్తంగా

ఘనంగా దేశమ్మ తల్లి వారాలు



గుచ్చిమిలో దేశమ్మతల్లి తిరువీధిలో పాల్గొన్న నిర్వాహకులు

సీతానగరం: వరిఉభాల పనులు ముగియడంతో మండలంలోని గ్రామాల్లో గ్రామ అమ్మవారు దేశమ్మతల్లికి రైతులు మొక్కులు తీసుకుంటున్నారు. ఈ మేరకు గుచ్చిమి, టి సీతారాంపురం గ్రామాల్లో గ్రామ పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించి దేశమ్మతల్లికి మొక్కులు తీర్చుకునేందుకు వారాల పండగ ఉత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గుచ్చిమిలో సర్పంచ్ ఎం. శ్రీదేవి, ఎంపీటీసీ సీహెచ్ జదీశ్వరరావు, బి శంకరరావు, మన్మథరావు, ఇతర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి పూజా సామగ్రితో ఘటాలతో ఊరేగింపు నిర్వహిస్తూ గుడివరకూ పాదయాత్ర చేసి మొక్కులు తీర్చుకున్నారు.

31న కోరన్న, మంగన్నల వర్ధంతి



మాట్లాడుతున్న ఏపీ గిరిజన సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ

గుమ్మలక్ష్మీపురం: శ్రీకాకుళం రైతాంగ పోరాట ఉద్యమంలో అసువులు బాసిన కోరన్న, మంగన్నల వర్ధంతి కార్యక్రమం ఈ నెల 31వ తేదీన గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించనున్నట్లు ఏపీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మండంగి రమణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కోలక అవినాష్ తెలిపారు. ఇదే విషయమై స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో సంఘ నాయకులతో ఆదివారం సమావేశమై, కోరన్న, మంగన్నల వర్ధంతి నిర్వహణపై చర్చించారు. గిరిజనుల హక్కుల సాధన కోసం ప్రాణాలు అర్పించిన వారిని స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, కార్యక్రమానికి పెద్దఎత్తున గిరిజనులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమావేశంలో సంఘ నాయకులు మండంగి ప్రసాద్, కె.గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకుల వితరణ



వితరణకు సిద్ధం చేసిన నిత్యవసర సరుకుల బ్యాగులతో దాతలు

పాలకొండ రూరల్: స్థానిక సత్యసాయి మందిరంలో పాలకొండ పట్టణంలోని తమ్మినాయుడు విద్యాసంస్థల ఉపాధ్యాయ సిబ్బంది పేదలకు నిత్యవసర సరుకులు ఆదివారం వితరణ చేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యుడు ఆర్.కిశోర్ నేతృత్వంలో దాతలు వాటిని పేదలకు అందజేశారు. ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని, ఆపదలో ఉన్న వారికి మనవంతు సాయం చేయాలని దాతలు తెలిపారు. భగవాన్ సత్యసాయి చూపిన శాంతి, ప్రేమ మార్గాలను ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు.

జిల్లేడు కషాయం తయారీపై అవగాహన



గుమ్మలక్ష్మీపురం: జిల్లేడు కషాయం తయారీని వివరిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ కో–ఆర్డినేటర్ భూషణరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాటిశీల గ్రామంలో జిల్లేడు కషాయం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కో–ఆర్డినేటర్ కిమిడి భూషణరావు జిల్లేడు ఆకులు, గోమూత్రం, చెరువు మట్టి, నీటితో జిల్లేడు కషాయం తయారు చేసి, చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వినియోగించే జిల్లేడు ద్రావణాన్ని పొట్ట దశలో ఉన్న పత్తి, అరటి, వరి పంటల్లో పిచికారీ చేస్తే అది పంటల సర్వరోగ నివారిణిగా పనిచేస్తుందన్నారు. అలాగే పంట ఏపుగా పెరగడంతో పాటు, చీడపీడలు, తెగుళ్ల దరిచేరవన్నారు. అనంతరం రైతులకు జిల్లేడు కషాయం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీవోఏ అనూష తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని నులకజోడు గ్రామంలో జిల్లేడు కషాయం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జిల్లేడు ఆకులు, బెల్లం, గోమూత్రం, పుట్టమన్ను, శనగపిండితో జిల్లేడు కషాయాన్ని ప్రయోగాత్మకంగా తయారు చేసి, చూపించారు. ఇలా తయారు చేసిన కషాయాన్ని మూడు రోజుల పాటు పులియబెట్టి, పంటలపై పిచికారీ చేస్తే చీడపీడలు, తెగుళ్ల సోకవన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సీఆర్పీలు వలరౌతు ప్రభాకర్, మోటక అంబోజీ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన అమ్మ

- ఘనంగా దేవీనవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



సీతానగరం: మండలకేంద్రంలో ఆటో ఆపరేటర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపంలో కొలువుదీరిన త్రిపుర సుందరిదేవి



సీతానగరం: బూర్జలో అమ్మవారికి పూజలు చేస్తున్న భవానీ భక్తులు



సాలూరు: పంచముఖేశ్వర స్వామి ఆలయంలో లలితా బాలత్రిపుర సుందరిగా పూజలందుకుంటున్న అమ్మవారు



సాలూరు: శైలపుత్రిగా పూజలందుకుంటున్న అమ్మవారు



సీతానగరం: తామరఖండిలో కొలువైన అమ్మవారు



బలిజిపేటలో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహం



సాలూరు: సామూహిక చండీ కుంకుమ పూజ



సాలూరు: బాలత్రిపుర సుందరి దేవిగా అవతారం ఎత్తిన జ్ఞాన సరస్వతి దేవి



సాలూరు: ప్రత్యేక అలంకరణలో ఏకామ్రనాథ స్వామి



మక్కువ: అలంకరణలో పోలమాంబ అమ్మవారు



మక్కువ: పూజలో పాల్గొన్న భక్తులు



పార్వతీపురం టౌన్: భవానీ దీక్షధారుల నగరసంకీర్తన



పార్వతీపురం టౌన్: బాలత్రిపుర సుందరి దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

సీతానగరం: విజయదశమి పండగను పురస్కరించుకుని నిర్వహించే దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు పలుగ్రామాల్లో ఆదివారం ప్రారంభమయ్యాయి. దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు తొమ్మిది రోజులు 9 అవతారాలతో భక్తులకు దర్శనమిస్తారు.

ఈ మేరకు సీతానగరం మండలంలోని పెదభోగిలి పంచాయతీ పరిధి సీతానగరం, బూర్జ, జోగింపేట, లచ్చయ్యపేట, బుడ్డిపేట, తామరఖండి, గెడ్డలుప్పి తదితర గ్రామాల్లో ఈ నేపథ్యంలో దూర ప్రాంతాల్లో వృత్తికళాకారులు తయారుచేసిన విగ్రహాలను శనివారం రాత్రి వాహనాల్లో గ్రామాలకు చేర్చుకున్న ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఉదయం మంటపాలపై త్రిపుర సుందరి అమ్మవారుగా అలంకరించారు. సీతానగరం మండల కేంద్రంలో అజ్జాడ బస్టాండ్ ఆటో వర్కర్స్ యూనియన్, ఉత్సవ కమిటీ సభ్యుల పర్య వేక్షణలో రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న మంటపంలో కొలువు దీరిన అమ్మవారికి ఆటో వర్కర్స్ యూనియన్, భవానీ భక్తులతో అర్చకుడు ఆర్.రామకృష్ణ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆటోవర్కర్స్ యూనియన్ ప్రతినిధులు,మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బలిజిపేట: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటుచేసి పూజలు చేశారు. తొలిరోజు అమ్మవారిని దుర్గామాతగా అలంకరించి పూజలు నిర్వహించారు, మండలంలోని బలిజిపేట, అజ్జాడ, తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటుచేశారు. అందులో భాగంగా బలిజిపేటలో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అర్చకుడు ప్రవీణ్ పూజాకార్యక్రమాలను చేస్తున్నారు. కొందరు భక్తులు మాలాధారణ చేశారు. నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కోవిడ్ దృష్ట్యా భక్తులు నిబంధనలు పాటించి దర్శనం చేసుకున్నారు.

బలిజిపేటలో..

సాలూరు: దేవి శరన్నవరాత్రులు సాలూరు పట్టణం మండలంలో వైభవంగా రంభమయ్యాచి పట్టణం, మండలంలో గల ఆలయాలతో పాటు ప్రత్యేక మంటపాల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారికి గాజుల అలంకరణ చేశారు.సామూహిక చండీ కుంకుమ పూజ నిర్వహించారు.ఏకామ్రనాథ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పంచముఖేశ్వరస్వామి ఆలయంలో లలితా బాలత్రిపుర సుందరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభించారు.

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి సన్నిధిలో ఆదివారం ప్రారంభించిన దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు పుష్పలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో రాధాకృష్ణ, ట్రస్ట్‌బోర్డుచైర్మన్ పూడి దాలినాయుడు, కమిటీసభ్యులు, ఉపసర్పంచ్ అల్లు వెంకటరమణ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశస్థాపన, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీపస్థాపన, రుత్విక్‌వరుణ, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలను చేశారు. మండలంలోని పలు గ్రామాలనుంచి వందలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

పార్వతీపురంలో..

పార్వతీపురంటౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో మొదటి రోజు బాలత్రిపుర సుందరి దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణ ప్రజలు దుర్గమ్మవారి ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన దుర్గ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. భవానీ దీక్షదారులు పట్టణంలో నగరసంకీర్తన చేపట్టడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

జీజీఎంపీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి



జేసీబీతో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న నిర్వాహకులు

సీతానగరం: గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో మండలంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఏఈ పవన్‌కుమార్, నిర్వాహకుడు ఆర్.తవిటి నాయుడు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం లక్ష్మీపురంలో జరుగుతున్న సీసీ కాలువల పనులను ఏఈ పవన్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఊరూరా వెళ్లిన సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరడంవల్ల ఎమ్మెల్యే అలజంగి జోగారావు ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో తాగునీరు సరఫరా, సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం, ఇంటింటి కుళాయిలు, విద్యుద్దీకరణ పనులు చేపడుతున్నారని తెలియజేశారు.

కళింగవైశ్యులకు రాజ్యాధికారం జగన్‌వల్లే సాధ్యం

- రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబు



నారాయణపురంలో సంఘం భవన నిర్మాణానికి వితరణ అందిస్తున్న చైర్మన్ సూరిబాబు, తదితరులు

బలిజిపేట: కళింగ వైశ్యులకు రాజ్యాధికారం, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వల్లే సాధ్యమవుతుందని రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురంలో కళింగ వైశ్య సంఘం భవనం నిర్మాణాన్ని ఆయన ఆదివారం పరిశీలించి నిర్మాణానికి కార్పొరేషన్ తరఫున రూ.50వేలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని కోరారు. కళింగ వైశ్యులను బీసీలో చేర్చేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని తెలిపారు. కేంద్రంలో ఓబీసీగా గుర్తింపు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని చెప్పారు. కళింగ వైశ్యుల్లో 90శాతం మందికి నవరత్నాల పథకాలు అందుతున్నాయని తెలిపారు. సాంకేతిక లోపాలు ఉన్న వారికి అందుబాటులోకి రాలేదని, వాటిని సరిచేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శివకుమారి, ప్రసాద్, మాధవి, మల్లికేశ్వరరావు, కె.సురేష్‌కుమార్, మన్యం జిల్లా సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు కె.రమేష్, నారాయణపురం కళింగ వైశ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మేమంతా వైఎస్సార్ సీపీలోనే..

సీతంపేట: మేమంతా వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతున్నామని, తామంతా టీడీపీలో చేరిపోయినట్లు వస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని మండలంలోని కిరప పంచాయతీ, పెద్దగూడ వాసులు స్పష్టం చేశారు. గ్రామానికి చెందిన మొత్తం 47 కుటుంబాల వారు టీడీపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని, అయితే అందులో వాస్తవం లేదని సవర మహేష్, బాలయ్య తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా సేవలందిస్తున్న సీఎం జగనన్న, ఎమ్మెల్యే కళావతి వెంటే ఉంటామన్నారు. ఎమ్మెల్యే చొరవతో గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు కూడా సక్రమంగా అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో గెలిపిస్తామని, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తామని, ఎమ్మెల్యే కళావతిని కూడా మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తామన్నారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వత్తాడలో చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: ప్రతిఒక్కరూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ సూచించారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మండలంలోని కొండవాడ, వత్తాడ గ్రామాల్లో డ్వాక్రా గ్రూపు మహిళలకు చేతుల పరిశుభ్రత–దానివల్ల కలిగే ప్రయోజనాలపై వైకేపీ సిబ్బంది ఆదివారం అవగాహన కల్పించారు. చేతులు అపరిశుభ్రంగా ఉంటే వాటిమీదనే క్రిములు, బ్యాక్టీరియా, వైరస్‌లు ఉంటాయని, మనం తినే ఆహారం ద్వారా అవి మన శరీరంలోకి ప్రవేశించి, తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రతిఒక్కరూ భోజనం చేసే ముందు తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. ఇలా చేస్తే 80 శాతం వ్యాధులు వ్యాపించకుండా ఉంటాయన్నారు. ఆయన వెంట సీసీ పి.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

• అ'పూర్వ' కలయిక



అజ్జాడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం

బలిజిపేట: మండలంలోని అజ్జాడ ఉన్నత పాఠశాలకు చెందిన 1982సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థి సంఘం నాయకుడు వి.నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అప్పటి ఉపాధ్యాయులు ఎ.రామూర్తినాయుడు, యోగి రెడ్డి శ్రీరాములు పాల్గొన్నారు. 40మంది పూర్వపు విద్యార్థులు ఒకచోట కలిసి వారివారి అనుభవాలను పంచుకున్నారు. ఎంతో ఆత్మీయమైన పలకరింపులతో ఆనాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ పెద్దవారైనా, ఉన్నత శిఖరాలను అధిరోహించి ఉన్నత పదవులలో ఉన్నప్పటికీ పాఠశాల జ్ఞాపకాలను చెరిపేయకుండా, వాటిని మధుర జ్ఞాపకాలుగా మలుచుకుని ఆనాటి ఉపాధ్యాయులను గుర్తుపెట్టుకుని సన్మానించడం పూర్వపు విద్యార్థుల ఔన్నత్యాన్ని చాటుతోందని ఉపాధ్యాయులు రామ్మూర్తి నాయుడు, శ్రీరాములు తెలిపారు. భవిష్యత్‌లో మరింత పేరు ప్రతిష్ఠలు పొందాలని పూర్వపు విద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి



జలవిహార్‌లో బోటుషికారు చేస్తున్న పర్యాటకులు

సీతంపేట: అడ్వంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో పాటు విద్యార్థులకు కూడా దసరా సెలవులు ఇవ్వడంతో పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి మన్యం అందాలను చూసేందుకు పెద్దసంఖ్యలో సీతంపేట చేరుకున్నారు. చాలామంది ఇక్కడి జలవిహార్‌లో బోటుషికారు, స్కై సైక్లింగ్ చేసేందుకు ఆసక్తి కనబరిచారు. మరికొంతమంది బంజి ట్రంపోలిన్, హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి ఆనందించారు.